
పడకేసిన పారిశుద్ధ్యం

- వరదొచ్చి వందరోజులైనా ఇంకా 'మురుగు'తోనే సహజీవనం
- 58, 59వ డివిజన్‌లలో అధ్వానంగా డ్రెయినేజీలు
- మురుగునీటితో అవస్థలు పడుతున్న ప్రజలు



59వ డివిజన్ లూనా సెంటర్ రోడ్డులో అధ్వానంగా డ్రెయినేజీ



ఎంకే బేగ్ స్కూల్ వెనుక రోడ్డులో కాలువలో పేరుకుపోయిన చెత్త

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరుకు వరదలు వచ్చి నూటపది రోజులు దాటినా సింగ్‌నగర్ ప్రాంత ప్రజలు ఇంకా మురుగునీటితోనే సహజీవనం చేస్తున్నారు. ప్రధానంగా 58, 59వ డివిజన్‌లలోని నివాసాల ముందు ఉన్న డ్రెయినేజీ కాలువల్లో పూడికలు సరిగా తీయడం లేదు. దీంతో నెలల తరబడి ఆ కాలువల్లో మురుగునీరు అలానే నిలిచిపోయి ఉంది. వాటి నుంచి వస్తున్న దుర్వాసనలు.. దోమల వల్ల స్థానిక ప్రజలు ఇళ్లల్లో ఉండేందుకు అవస్థలు పడాల్సి వస్తుంది.

దోమలకు ఆవాసాలు

స్థానిక 58, 59వ డివిజన్ల పరిధిలోని మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం, నల్లమస్తాన్ రోడ్డు, పీఅండ్‌టీ కాలనీ, కృష్ణా హోటల్ సెంటర్, సింగ్‌నగర్ లూనాసెంటర్, ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ ఎదురు, వెనుక భాగాలు, కొవ్వొత్తుల బజార్, జెండా చెట్టు రోడ్డు, లెనిన్ సెంటర్, వాటర్ ట్యాంక్ ముందు, వెనుక రోడ్లలోని కాలువల్లో పూడికలు సరిగా తీయడం లేదు. దీంతో చాలా చోట్ల చెత్తా.. చెదారాలు పేరుకుపోయాయి.



58వ డివిజన్‌లో కాలువలో పేరుకుపోయిన మురుగు

మురుగు ముందుకు పారకపోవడంతో డ్రెయినేజీలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. వీటి నుంచి వస్తున్న దుర్వాసనలు, దోమల వల్ల ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు



వాటర్ ట్యాంక్ పక్క రోడ్డులో సైడ్ డ్రెయిన్ దుస్థితి

నివాసాల ముందు మురుగు పేరుకుపోవడం వల్ల తరచూ తాము అనారోగ్యాలకు గురికావాల్సి వస్తోందని స్థానిక ప్రజలు కలత చెందుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు జ్వరాలతో బాధపడుతున్నారని, ఇళ్ల ముందు కాలువలు సరిగా తీయమని శానిటరీ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఈ డివిజన్‌లలో తిష్టవేసిన పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

దేవీనగర్ రోడ్డులో ఫెన్సింగ్ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డులో బుడమేరు పక్కన ఫెన్సింగ్ వేసేందుకు నగరపాలకసంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. బుడమేరు వంతెన రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వరకు ఫెన్సింగ్ వేసేందుకుగానూ మార్కింగ్ వేశారు. బుడమేరు పక్కన ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఫెన్సింగ్ వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఫెన్సింగ్ పనులకు శ్రీకారం చుట్టడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాటర్‌పైపులైన్ పనులు వేగవంతం



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): మధురానగర్ పసుపుతోటలో వాటర్ వర్క్స్ పనులు వేగవంతం చేశారు. ఇక్కడ పనులు నత్తనడకన సాగడంతో పాటు కాంట్రాక్టర్, సిబ్బంది అందినకాడికి దండుకుంటున్నారు. ఈ విషయాలను వివరిస్తూ సాక్షిలో అందినకాడికి దండుకోవడమే శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు వాటర్ వర్క్స్ పనులు వేగవంతం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని.. ప్రతి పాత కనెక్షన్ ఉచితంగా ఇస్తామని అధికారులు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): క్రిస్మస్‌ను పురస్కరించుకుని బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నిరుపేద చిన్నారులకు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లిక, ఎస్‌కే షఫీ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను నిరుపేదలు సైతం ఘనంగా జరుపుకోవాలని నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ట్రస్ట్ సభ్యుడు హేమంతరావు పాల్గొన్నారు.

గాయకులు సాధనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విజయవాడ కల్చరల్: గాయకులు సాధనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హిమబిందు సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకురాలు కంచి మల్లీశ్వరి అన్నారు. హిమబిందు సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ, తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి, క్రామ్డ్ జీఆర్ సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ రచయిత రాసిన భావాన్ని భావ, రాగయుక్తంగా గానం చేయాలన్నారు. ప్రతి నెలా కార్యక్రమం నిర్వహిస్తూ నూతన గాయకులకు వేదిక కల్పిస్తునట్లు తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో కే డేవిడ్‌రాజు, డీ వీరభద్రరావు, పరుచూరి విజయలక్ష్మి, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు. గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

పాలిటెక్నిక్ కృష్ణా రీజియన్ క్రీడలు ప్రారంభం

విజయవాడస్పోర్ట్స్: పాలిటెక్నిక్ కృష్ణా రీజియన్ అంతర కళాశాలల బాలుర క్రీడా పోటీలు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు క్రీడా జ్యోతి వెలిగించి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కృష్ణాజిల్లాలోని 24 కళాశాలల నుంచి 654 క్రీడాకారులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్.పద్మావతి, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్ మధుసూదనరావు తెలిపారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని, పోటీల అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయసారథి, రాష్ట్ర పీడీల సంఘం అధ్యక్షుడు కమల్‌బాషా పాల్గొన్నారు.

స్కేటర్ జెస్సీరాజ్‌కు కేంద్ర పురస్కారం

26న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు ప్రదానం



మాత్రపు జెస్సీరాజ్

విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ స్కేటింగ్ వేదికపై అద్భుత ప్రదర్శన ఇచ్చి ప్రపంచ క్రీడా ప్రముఖుల మన్ననలు పొందిన ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్‌ను ప్రతిష్ఠాత్మక ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్–2025 వరించింది. ఏటా దేశంలోని 25 మంది ప్రతిభావంతులైన చిన్నారులకు కేంద్రం ఈ పురస్కారం అందజేస్తోంది. ఈ ఏడాది క్రీడా విభాగంలో జెస్సీరాజ్‌ను ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ నెల 17న విడుదల చేసిన జాబితాలో పేర్కొంది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేస్తారు. విజయవాడ పటమటలోని ఎస్‌ఎస్‌ఎం స్కూల్‌లో జెస్సీ తొమ్మిదో తరగతి చదువుతోంది. స్కేటింగ్‌పై ఆమె చూపుతున్న ఇష్టాన్ని తల్లిదండ్రులు మాత్రపు రాధ, సురేష్ గమనించి కోచ్ సింహాద్రి వద్ద శిక్షణ ఇప్పించారు. తొమ్మిదేళ్ల వయసు నుంచే శిక్షణ తీసుకుంటూ ఇప్పటి వరకు 50 రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పతకాలను సొంతం చేసుకుంది.

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రైమరీ స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన క్రీస్తు జననం లఘు నాటకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాదర్ ఎస్.సుమంత్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు దేవుని సందేశం వినిపించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ జాన్స్ విద్యాసంస్థల ప్రెసిడెంట్ టి.మోనికా, కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజు, డైరెక్టర్ దీపిక, ప్రిన్సిపాల్ కె.పావన దీప్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్థానిక 24వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఆ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత పాల్గొని కేక్‌కట్ చేశారు. కస్తూరిభాయిపేట ఆర్సీఎం చర్చిలో గిరిపురం పాస్టర్ల సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు, పాస్టర్లు పాల్గొన్నారు.



సెమీక్రిస్మస్‌లో మాట్లాడుతున్న ఏసీపీ దామోదర్‌రావు

గుణదల పీఎస్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక గుణదల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యాన సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఏసీపీ కే దామోదర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అన్ని మతాల సారం ఒక్కటేనని అన్నారు. గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పాస్టర్ జే డానియల్, పాస్టర్ నవీన్‌కుమార్ క్రిస్మస్ సందేశం వినిపించారు.



సెయింట్ జాన్స్ స్కూల్‌లో క్రీస్తు జననం నాటక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ సుధాకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని ఏలూరు లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ పి. సుధాకర్ సూచించారు. వినియోగదారుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వినియోగదారులు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇక్కడ తెలుసుకున్న విషయాలను తోటివారికి తెలియజేసి వినియోగదారులు మోసపోకుండా విద్యార్థులు వారి వంతు పాత్రను సమర్థవంతంగా పోషించాలని కోరారు. లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ ఎ. కృష్ణ చైతన్య వివిధ రకాల కొలతలు, తూనికల గురించి అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు వినియోగారుల వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కన్స్యూమర్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. నవీన, కళాశాల కామర్స్ విభాగం ఇంచార్జ్ సి.హెచ్. కొండలరావు, రోజలిండ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలేజి కండ్రికలో రెవెన్యూ సదస్సు

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రిక సొసైటీ వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో స్థానిక రైతులు విద్యుత్ టవర్ల నిర్మాణంలో తమ భూములను కోల్పోయామని ఆ భూములన్నీ విజయవాడ కార్పొరేషన్ పరిధిలో ఉన్నందున ఆ ప్రాంతంలో భూమి రిజిస్ట్రేషన్ విలువను బట్టి నూటికి నూరు శాతం నష్టపరిహారం ఇవ్వాలని తహసీల్దారుకు వినతి పత్రాలు అందజేశారు. నష్టపరిహారం చెల్లింపులో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయకపోతే త్వరలో నిరాహార దీక్ష చేస్తామని రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యర్లగొర్ల తిరుపతమ్మ, సాగునీటి సంఘం అధ్యక్షుడు మురారి శ్రీనివాసరావు, కె.రవికుమార్, సర్వేయర్ జనార్దన్, ఆర్‌ఐ రాజేష్, వీఆర్వోలు, విలేజి కండ్రికకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయ స్వామివారి ఆలయంలో శుక్రవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ పి. లోకేశ్వరి పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నరుపేట సెక్షన్ పరిధిలోని వివిధ ఫీడర్లలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్ స్టేషన్ ఏరియా, కంట్రోల్ రూమ్ ఏరియా, పట్టాభిరామయ్య వీధి, పాటిబండ్లవారి వీధి, ఆంజనేయ స్వామిగుడి వీధి, పొట్టిస్వామి వీధి, తానియా హోటల్ ఏరియా, మందపాటి వారి వీధి, టైర్ భవన్ రోడ్డు, బందర్ లాకులు ఏరియా, విజయ్ కృష్ణా సూపర్ బజార్ ఏరియా, ఆకులవారి వీధి, బీసెంట్ రోడ్డు, శ్రీపతి సూర్యనారాయణ వీధి (జైన్ మందిరం రోడ్డు), రాజగోపాలచారి వీధి, అట్టారత్తయ్య వీధి, గోపాల్‌రెడ్డి రోడ్డు, మేరీవీధి, గూడవల్లివారి వీధి, బైరెడ్డి రామన్న వీధి, అలీబేగ్ వీధి, బందర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అలాగే గాంధీనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ పూర్ణానంద పేట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు తెలిపారు. లక్ష్మణరావు వీధి, సుబ్బారావు వీధి, బేగ్ వీధి, మంచాలవారి వీధి, బత్తులవారి వీధి, ఖాదర్ వీధి, డేవిడ్ వీధి, గంటివారి వీధి, గుర్రాల వారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ బుడమేరు మధ్యకట్ట ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయదుర్గానగర్, బుడమేరు మధ్యకట్ట, కేఎల్‌రావు నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

భవానీమాతాకీ.. జై..



అర్జున్ వీధిలో విద్యుద్దీపాలంకరణ





అమ్మవారి సన్నిధిలో భవానీలు

దీక్షలను విరమించేందుకు భవానీలు పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. శనివారం నుంచి దీక్ష విరమణ మహోత్సవాలు ప్రారంభమవుతాయి. అమ్మవారు కొలువై ఉండే ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేసి ఆ తల్లిని దర్శించుకుని ఇరుముడి సమర్పించడంతో దీక్ష పూర్తి చేస్తారు. రైళ్లు, బస్సుల్లో భవానీలు నగరానికి చేరుకుని అక్కడి నుంచి ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విద్యుత్ వెలుగుల్లో మహారాజగోపురం



అర్జున్‌వీధిలో ప్రసాదాల కౌంటర్





అమ్మవారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లు



కృష్ణవేణిఘాట్ సమీపంలో కేశఖండనశాల